క్లుప్తంగా

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



గీతా జ్ఞానయజ్ఞంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లటౌన్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. బీవైనగర్ శ్రీ భక్తాంజనేయ శివపంచయాతన దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన గీతా జ్ఞాన యజ్ఞం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో యజ్ఞానంద స్వామి ప్రవచనాలను వినడం ఆనందంగా ఉందన్నారు. చిన్మయ మిషన్ కన్వీనర్ సజ్జనం శ్రీనివాస్, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు ఏర్పాటు



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేశ్

ముస్తాబాద్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతర్ జిల్లా సరిహద్దుల వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సురేశ్ తెలిపారు. మండలంలోని వెంకట్రావుపల్లె వద్ద సోమవారం చెక్‌పోస్టును ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మూడు షిఫ్టుల్లో పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలతోపాటు ఇతర శాఖల అధికారులు విధులు నిర్వహిస్తారన్నారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు పట్టుబడితే తగిన ఆధారాలు చూపాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఆర్‌ఐ రఘు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ పడిగెల మానస అధ్యక్షతన మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో (ఎఫ్‌ఏసీ) జోగం రాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి చెందిన అన్ని ప్రభుత్వ శాఖల మండల అధికారులు, గ్రామపంచాయతీల స్పెషల్ అధికారులు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

పరామర్శ



సిరిసిల్లటౌన్: మున్సిపల్ రిటైర్డ్ ఉద్యోగి మడుపు రాజగన్నారెడ్డి ఇటీవల మృతిచెందాడు. సోమవారం సిరిసిల్ల రెడ్డివాడలోని బాధిత కుటుంబ సభ్యులను కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. గన్నారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు. టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, మడుపు విజయ భాస్కర్ రెడ్డి, మడుపు, నవీన్‌రెడ్డి తదితరులున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



పరీక్ష సామగ్రి అందిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: పది విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు అన్నారు. మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ..విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉత్తమ ర్యాంకులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక, పీటీసీ ఇల్లందుల గీతాంజలి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

కోనరావుపేట: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ప్రజలు ఉల్లంఘించవద్దన్నారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తులను కించపరిచే విధంగా పోస్టులు చేయవద్దన్నారు. ఆయనవెంట ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

పార్క్ పనులు షురూ..

- మండల పరిషత్ కార్యాలయం పక్కన రూ.2కోట్లతో నిర్మాణ పనులు
- హర్షం వ్యక్తంచేస్తున్న పట్టణవాసులు



మండల పరిషత్ కార్యాలయం పక్కన చేపడుతున్న పార్క్ పనులు

వేములవాడఅర్బన్: ఉరుగుల పరుగుల జీవితంలో ఎంతోఎంతో మంది ఒత్తిడికి లోనవుతున్నారు. కాస్త సమయం దొరికితే వ్యాయామం, పార్కులకు వెళ్తే ఆహ్లాదకరంగా ఉంటుందని చాలామంది ఆసక్తి కనబరుస్తుంటారు. అయితే పట్టణ ప్రజలకు ఆహ్లాదం కల్పించేందుకు వేములవాడ మండల ప్రజాపరిషత్ కార్యాలయం పక్కన పార్కు పనులు చేపట్టారు. పట్టణంలో ప్రభుత్వ స్థలాలు కరువయ్యాయి. పట్టణ నడిబొడ్డున పార్క్‌కోసం స్థలాలు లేక ఇబ్బందిగా మారింది. ప్రభుత్వ స్థలాలు అనుకులంగా లేకపోవడంతో వేములవాడ మండల పరిషత్ కార్యాలయం పక్కన సుమారు ఎకరం స్థలంలో మున్సిపల్, వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీడీఏ) అధికారులు ప్రణాళిక రూపొందించి ఇటీవల పార్క్‌పనులు ప్రారంభించారు. వీటీడీఏ నిధులు రూ.2 కోట్లతో అన్ని హంగులతో నిర్మాణ పనులు చేపట్టనుండగా పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాక్, ఇతర పరికరాలు ఏర్పాటు

మండల పరిషత్ కార్యాలయం పక్కన పార్క్ పనులు జరుగుతున్నాయి. మండల పరిషత్ కార్యాలయం కొంపౌండ్‌లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా నిత్యం వివిధ పనుల నిమిత్తం ప్రజలు వస్తుంటారు. పార్క్ నిర్మాణం చేపడితే దీంతో అందరికీ ఆహ్లాదకరంగా ఉంటుంది. పార్క్ చుట్టూ మూడు ఫీట్ల ప్రహరీ ఏర్పాటు చేసి కంచె వేయనున్నారు. అనంతరం శివుడి విగ్రహం ఏర్పాటుతో పాటు పూల మొక్కలు, నడక ట్రాక్, చిన్నారులు ఆడుకునేందుకు వివిధ రకాల పరికరాలు, కూర్చుండేందుకు సిమెంట్ బెంచీలు, ఫౌంటేయిన్లను ఏర్పాటు చేయనున్నారు.

సుందరీకరణ పనులు..

పట్టణంలోని మూలవాగు ఒడ్డున రెండువైపులా ట్యాంక్‌బండ్ సుందరీకరణ నిర్మాణ పనులు చేశారు. మూలవాగు ఒడ్డున ఉన్న ట్యాంక్‌బండ్ పార్క్‌ను ప్రారంభించారు. అలాగే తిప్పాపూర్ పక్కన మూలవాగు ఒడ్డున ట్యాంక్‌బండ్ పనులు పూర్తి చేస్తుండగా ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో పట్టణంలోని చిన్నారులు ప్రతిరోజూ సాయంకాలం, సెలవు రోజుల్లో ట్యాంక్‌బండ్ పార్క్‌లో చిన్నారులు వివిధ ఆటలు ఆడుతున్నారు.

అన్ని హంగులతో నిర్మాణం



వేములవాడ మండల పరిషత్ కార్యాలయం పక్కన ఎకరం స్థలంలో రూ.2కోట్లతో పార్క్ పనులు జరుగుతున్నాయి. అన్ని హంగులతో నిర్మాణ పనులు చేపట్టాం. పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చేలా చూస్తాం.

– అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

‘పది’ పరీక్షలు ప్రారంభం



వీర్నపల్లి: పరీక్షకేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు



ఎల్లారెడ్డిపేట: పరీక్షకు హాజరైన విద్యార్థులు



ముస్తాబాద్‌లో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థినులు

ఎల్లారెడ్డిపేట: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మండలకేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో రెండు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. రెండు కేంద్రాల్లో కలిసి 458మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు తనిఖీ చేసి లోపలికి అనుమతించారు.

బోయినపల్లి: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. బోయినపల్లి కేంద్రంలో 204 మందికి ఒకరు గైర్హాజరుకాగా, విలాసాగర్ కేంద్రంలో 91 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈవో శ్రీనివాస దీక్షిత్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఎంఈఓ తనిఖీ చేశారు.

ముస్తాబాద్: ముస్తాబాద్‌లోని జెడ్పీ ఉన్నత బాలికల, బాలుర పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో 537 మంది విద్యార్థులు హాజరైనట్లు కస్టోడియన్ రాజిరెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో భాస్కరశర్మ, ఫ్లయింగ్ స్క్వాడ్ పరిశీలించారు.

తంగళ్లపల్లిలో..

తంగళ్లపల్లి: మండలవ్యాప్తంగా ఏర్పాటుచేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో (తంగళ్లపల్లి, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, జిల్లెల్ల) విద్యార్థులు పరీక్ష రాశారు. అధికారులు అన్నిచర్యలు చేపట్టారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పది పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 229 మంది విద్యార్థులకు 228 మంది హాజరైనట్లు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ చంద్రశేఖర్, చీఫ్ సూపరింటెండెంట్ మురళీధర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి వసతి, అన్ని సౌకర్యాలు కల్పించారు.

సొంత పార్టీ నాయకులపై ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ పార్టీ నాయకులపైనే ఆ పార్టీ నాయకుడు ఫిర్యాదు చేశాడు. ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ నాయకుల పనితీరుపై కాంగ్రెస్ యూత్ మండల నాయకుడు బుచ్చిలింగు సంతోష్‌గౌడ్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశాడు. బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు దొమ్మాటి నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డిల పనితీరుపై ఫిర్యాదు చేశాడు. మండలంలో చేపట్టే కార్యక్రమాల వివరాలు తనకు తెలపడం లేదని శ్రీనివాస్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు.

కరెంట్‌షాక్‌తో చేపలు పట్టిన ముగ్గురి రిమాండ్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని గొల్లపల్లి శివారులోని రాపెల్లివాగులో ఆదివారం కరెంట్‌షాక్‌తో చేపలు పడుతున్నారని వంగల శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన శివరాత్రి శ్రీనివాస్, కుంచం పరశురాములు, శివరాత్రి మల్లేశ్ కరెంట్‌షాక్ పెట్టి రాపెల్లివాగులో చేపలు పడుతున్నారు. శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ విద్యుత్‌షాక్‌తో వన్యప్రాణులను వేటాడడం, చేపలు పట్టడం చేస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

సంకల్పసభకు తరలిన నాయకులు



కోనరావుపేట: జగిత్యాల జిల్లాకేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రధాని నరేంద్రమోదీ విజయ సంకల్ప సభకు మండంలోని అన్ని గ్రామాల నాయకులు తరలివెళ్లారు. బీజేపీ అధ్యక్షుడు గొట్టె రామచంద్రం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.



ముున్సిపల్‌లో దరఖాస్తుల వెల్లువ

వేములవాడ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల్లో గృహజ్యోతి, పలు పథకాల్లో అర్హులైనవారికి లబ్ధి చేకూరడం లేదు. సోమవారం మరోసారి మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించేందుకు జనం ఇలా బారులుతీరారు.

మృతుడి కుటుంబానికి బియ్యం వితరణ

వీర్నపల్లి : మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన కముటం రాజేశ్వర్ (48) మూడురోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. జిల్లా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం అందించారు. కళాకారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఇక్కడ జిల్లా సాంస్కృతిక శాఖ గౌరవా అధ్యక్షుడు రాములు, ప్రదాన కార్యదర్శి దేవయ్య, మండల సాంస్కృతిక శాఖ అధ్యక్షుడు నేరెళ్ల ముత్యం గౌడ్, కళాకారులు అంజయ్య, ఎల్లగౌడ్, రాజం, సతీశ్, లచ్చయ్య, హన్మాండ్లు, లచ్చయ్య, లింబయ్య తదితరులున్నారు.

ఫ్లెక్సీలు, పోస్టర్ల తొలగింపు



బోయినపల్లి: పోస్టర్‌ను తొలగిస్తున్న జీపీ సిబ్బంది

బోయినపల్లి(చొప్పదండి): పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 24 గంటలు గడిచినా, ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగించకపోవడంతో ‘కోడ్ కూసినా తొలగని ఫ్లెక్సీలు’ అనే శీర్షికన సోమవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు అధికారులు స్పందించి మండలకేంద్రంలో గ్రామపంచాయతీ సిబ్బంది ఫ్లెక్సీలతో పాటు పోస్టర్లు తొలగించారు. కొన్ని పోస్టర్లు కనిపించకుండా సున్నం పూశారు.

చందుర్తిలో..

చందుర్తి : ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంలో మండలకేంద్రంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వాల్ పోస్టర్లను గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించారు. రెండ్రోజులుగా అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేయడంతో పోస్టర్లు, రాజకీయ పార్టీలకు చెందిన జెండా గద్దెలు, నాయకులు విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు.

వీర్నపల్లి: ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కకరూ పాటించాలని ఎంపీవో నరేశ్ కుమార్ అన్నారు. జీపీ సిబ్బందితో గ్రామాల్లో రాజకీయ పార్టీలకు సంబందించిన వాల్ పోస్టర్లు, వాల్ రైటింగ్‌లు, జెండా గద్దెలకు ఉన్న రాజకీయ పార్టీ గుర్తులను రెండ్రోజుల్లో తొలగిస్తామన్నారు. అందుకు వివిధ పార్టీలకు చెందినవారు సహకరించాలన్నారు.



చందుర్తిలో వాల్‌పోస్టర్ తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

వేములవాడ: పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్లో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగించే ఉప్పుల పుష్ప (50) అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. సొంత ఇల్లులేక కిరాయి ఉన్న ఇంటిముందు పార్థివదేహాన్ని ఉంచారు. అంతిమ సంస్కారానికి ఇబ్బంది ఉండటంతో మై వేములవాడ ట్రస్ట్ సభ్యులు ఆశ్రయించగా దాతల సహకారంతో రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు మధు మహేశ్, పాత సంతోష్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, ప్రతాప నటరాజు, వేణు, జవ్వాజి రాజశేఖర్, గుమ్మడి కుమార్, శ్రీధర్ యాదవ్, గోగికారి రాజు, కోటగిరి రాజశేఖర్, దేవేందర్, నాగరాజు, పొలాస రాజేందర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రతీ ఇంటికి తాగునీరందిస్తాం



బావిని పరిశీలిస్తున్న ఈఈ జానకి, డీఈలు రాము, ప్రేమ్‌చంద్

- మిషన్ భగీరథ ఈఈ జానకి

సాక్షి స్పందన

ముస్తాబాద్: నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని, అన్ని గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరందిస్తామని మిషన్ భగీరథ ఈఈ జానకి, డీఈఈలు ప్రేమ్‌చంద్, రాము పేర్కొన్నారు. ‘సాక్షి’లో ‘తాగునీటికి కటకట’ శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. ఈఈ జానకి ఆధ్వర్యంలో ఇద్దరు డీఈలు, ఎంపీడీవో భాస్కర శర్మ, ఏఈలు ముస్తాబాద్ మండలంలో సోమవారం పర్యటించారు. నామాపూర్, చిప్పలపల్లి, సేవాలాల్ తండా, తెర్లుమద్ది, ముస్తాబాద్ గ్రామాల్లో నీటి వనరులు పరిశీలించారు. ఈఈ జానకి మాట్లాడుతూ మిడ్‌మానేరులో నీటి లభ్యత తక్కువగా ఉందని, ఎగువమానేరు కోళ్ల మద్ది పథకం ద్వారా ఊరూరా నీటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న బోరుబావులు, బావుల ద్వారా నీటిని అందిస్తామన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటడడంతో నీటి లభ్యత తగ్గిందన్నారు. దీనిని అధిగమించే చర్యలు తీసుకుంటామన్నారు. ఏఈ సంతోష్, పంచాయతీ కార్యదర్శులున్నారు.



కనుచూపు మేర ‘పచ్చని’ కనువిందు..

సిరిసిల్ల: ఈ చిత్రంలో కనిపించేంది కోనసీమ పంట పొలాలు కాదు.. జిల్లాలోని కోనరావుపేట అందాలు. మండలంలోని మల్కపేట రిజర్వాయర్ పరిసరాల్లోని కోనరావుపేట–నిజామాబాద్ గ్రామాల శివారులో కనిపించే ఈ పంటపొలాలు. పచ్చటి అందాలతో కనువిందు చేస్తున్నాయి. రిజర్వాయర్ కట్టపై నుంచి ఈ దృశ్యం కనిపించింది.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



మద్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ ఎస్సై


చందుర్తి: మద్యం దుకాణ యాజమానులు ఎన్నికల నిబంధనలను పాటించాలని వేములవాడ ఎక్సైజ్ ఎస్సై రవి కోరారు. చందుర్తి మండలంలోని మర్రిగడ్డ, చందుర్తి వైన్స్ షాపులను సోమవారం తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్‌ను అమలులో ఉన్నందున షాపు యాజమానులు రోజువారి స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు అందించాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాకుండా దుకాణాలను నిర్ణయించిన సమయంలో తెరిచి , మూసి వేయాలన్నారు. సమయపాలన పాటించకపోతే దుకాణాలను సీజ్ చేస్తామన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.



నాగారం శివారులో పశువులకు ఆహారంగా వరిపంట



కోనరావుపేట శివారులో ఎండుతన్న వరి



ధర్మారంలో ఓ వ్యవసాయ బావిలో అడుగంటిన నీరు

చి‘వరి’కి ఆశలన్నీ ఆవిరి

కోనరావుపేట: ఎవేసవి ప్రారంభంలోనే భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. బోరు బావుల్లో నీరు తగ్గడంతో పాటు, వ్యవసాయ బావుల్లో నీరు ఇంకిపోతుంది. దీంతో ఆయా గ్రామాల్లో చేతికందిన వరిపంటలకు సాగు నీరందక ఎండిపోతున్నాయి. దీంతో రైతుల ఆశలన్నీ ఆవిరైపోయాయి. చేసేదేమీ లేకపోవడంతో ఇలా పశువులు, గొర్రెలు ఆహారంగా మిగిలింది.